నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, మంగళవారం 13 మే 2025 RANGAREDDY

# కీచక అధికారి సస్పెన్షన్ ?

- నమస్తే తెలంగాణ కథనానికి స్పందించిన ఆడిట్ శాఖ ఉన్నతాధికారులు
- రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌తో విచారణ

నమస్తే ఎఫెక్ట్

వికారాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : కలెక్టరేట్‌లో ఓ కీచక అధికారి శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో శనివారం ప్రచురితమైన కథనానికి ఆడిట్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిట్ కార్యాలయంలో బాధితురాలితోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారితో రాష్ట్ర ఆడిట్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ విడివిడిగా మాట్లాడి వివరాలను సేకరించారు. అంతేకాకుండా సంబంధిత శాఖ ఉద్యోగులతోనూ మాట్లాడారు. అయితే నేడు లేదా రేపో లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారిపై చర్యలు తీసుకునే అవకాశముందని సమాచారం. మరోవైపు సోమవారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి జిల్లా పర్యటనతో కలెక్టర్ బిజీగా ఉన్న దృష్ట్యా మంగళవారం కలెక్టర్‌కు కీచక అధికారిపై ఫిర్యాదు చేయనున్నారు. సెలవు కావాలంటే జిల్లా ఆడిట్ కార్యాలయ అధికారి పర్సనల్‌గా కలవాలంటూ, అసభ్య ప్రవర్తనతో లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని 'నమస్తే తెలంగాణ'కు తన ఆవేదనను వెల్లబోసుకున్న విషయం తెలిసిందే.



ఇదేనా మార్పు?

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లా..

# డంపింగ్ యార్డా..?

### బీఆర్‌ఎస్ హయాంలోనే పూర్తయిన నిర్మాణాలు..

**అర్హులకు కేటాయించని సోలీపూర్ సమీపంలోని 412 రెండు పడకల ఇండ్లు**

- ఇండ్ల నిర్మాణం పూర్తి కాగానే ఎన్నికల కోడ్
- తదనంతరం పవర్‌లోకి కాంగ్రెస్ పార్టీ..
- లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం
- ఇండ్ల పక్కనే చెత్త పారబోత.. కంపు కొడుతున్న పరిసరాలు


డబుల్‌బెడ్రూం ఇండ్ల మధ్యలో పారబోస్తున్న చెత్తాచెదారం

షాద్‌నగర్ టౌన్, మే 12 : ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేసేలా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇలా షాద్‌నగర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కృషితో 1880 ఇండ్లను నిర్మించింది. అందులో షాద్‌నగర్‌లోని గుంట్లకుంట శివారులో 920, సోలీపూర్ గ్రామ సమీపంలో 412, దూసకల్ 368, నందిగామలో 120, తిమ్మాపూర్‌లో 60 ఇండ్ల నిర్మాణం పూర్తైంది. అయితే.. అప్పుడే అసెంబ్లీ ఎన్నికలు జరగడం.. అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ రావడంతో ఆ ఇండ్ల పంపిణీ ప్రక్రియ ఆగిపోయింది. కోట్లాది రూపాయలతో నిర్మించిన ఇండ్లు నిరుపయోగంగా మారాయి. అర్హులకు వాటిని కేటాయింపులో ఆలస్యం జరుగుతుండడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. డబుల్‌బె డ్రూం ఇండ్లతో తమ సొంతింటి కల నెరవేరుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగులుతున్నది.

**డంపింగ్‌యార్డులో కలిసిపోయిన డబుల్‌బెడ్రూం ఇండ్లు**

షాద్‌నగర్ పట్టణంలో సేకరించిన చెత్తాచెదారాన్ని పూర్తిగా షాద్‌నగర్ మున్సిపాలిటీ సోలీపూర్ గ్రామ సమీపంలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. ఈ డంపింగ్ యార్డుకు సమీపంలోనే 412 డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే వాటిని అర్హులకు పంపిణీ చేయడంలో ఆలస్యం అవుతుండడంతో రోజూవారీగా పట్టణంలో సేకరిస్తున్న చెత్తాచెదారాన్ని కోట్లాది రూపాయలతో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్ల పక్కనే పోస్తుండడంతో.. ఆ ఇండ్లు పూర్తిగా డంపింగ్‌యార్డులో కలిసి పోయి..కంపుకొట్టడంతోపాటు దుర్గంధం వెదజల్లుతున్నది. ఆ ఇండ్లు శిథిలావస్థకు చేరకముందే అర్హులకు త్వరగా పంపిణీ చేసి.. డంపింగ్ యార్డును అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని లబ్ధిదా రులు, ప్రజలు కోరుతున్నారు.

**గత కేసీఆర్ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. సోలీపూర్ గ్రామ సమీపంలో 412 ఇండ్లను నిర్మించగా.. వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేసే సమయంలో ఎన్నికల కోడ్ రాగా.. ఆ ప్రక్రియ ఆగిపోయింది. తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ విషయాన్ని అస్సలు పట్టించుకోవడం లేదు. లబ్ధిదారులకు కేటాయించడంలో రోజురోజుకూ ఆలస్యం జరుగుతుండడంతో ఆ ఇండ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. అంతేకాకుండా ఆ ఇండ్ల సమీపంలోనే షాద్‌నగర్ పట్టణం నుంచి సేకరించి తీసుకొస్తున్న చెత్తాచెదారాన్ని డంప్ చేస్తుండడంతో ఆ పరిసరాలు కంపు కొడుతున్నాయి.**

**ఇండ్ల పంపిణీలో ఆలస్యమెందుకు..?**



పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్ల పంపిణీలో ఎందుకు ఆలస్యం జరుగుతున్నది. ఆ ఇం డ్లను కోట్లాది రూపాయలతో నిర్మించారు. వాటి పక్కనే చెత్తాచెదారాన్ని వేస్తుండడంతో కంపు కొట్టడంతోపాటు తీవ్రంగా దుర్గంధం వెదజల్లుతున్నది. అధికారులు స్పందించి అక్కడి నుంచి డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించి.. ఆ ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలి.

-చీపిరి రమేశ్‌యాదవ్, గ్రామస్తుడు, సోలీపూర్

**శిథిలావస్థకు చేరుతున్నాయి..**



అర్హులకు డబుల్‌బెడ్రూం ఇండ్లను వెంటనే కేటాయించాలి. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని నిర్మించింది. ఇండ్ల పంపిణీలో ఆలస్యం అవుతుండడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. షాద్‌నగర్ పట్టణంలో సేకరించిన చెత్తాచెదారాన్ని డబుల్‌బెడ్రూం ఇండ్ల మధ్య పారబోయకుండా అధికారులు చర్యలు తీసుకుని, లబ్ధిదారులకు కేటాయించాలి.

-శీలం శ్రీకాంత్, టీఆర్‌ఎస్వీ తాలూకా అధ్యక్షుడు, షాద్‌నగర్


పల్లె ప్రకృతివనంలో కాలిపోయిన మొక్కలు

## పల్లె ప్రకృతి వనానికి

# నిర్లక్ష్యపు నిప్పు

### పలుగుతండాలో అగ్నికి ఆహుతైన మొక్కలు


దోమ, మే 12 : పర్యావరణాన్ని పరిరక్షించాలనే సంకల్పంతో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పల్లెప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి విరివిగా మొక్కలను నాటి ఆహ్లాదాన్ని పంచగా.. నేటి కాంగ్రెస్ పాలనలో వాటి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కనుమరుగవుతున్నాయి. ఇందుకు నిదర్శనం మండలంలోని పలుగుతండా పంచాయతే.. ఇక్కడ ఏర్పాటు చేసిన పల్లెప్రకృతివనంలో నాటిని మొక్కలకు నీటిని అందించకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. దానికి తోడుగా గుర్తు తెలియని వ్యక్తులు గడిసింగాపూర్ రంగారెడ్డిపల్లిని కలిపే ప్రధాన రోడ్డు పక్కన అడవిని ఆనుకుని ఉన్న పొదలకు నిప్పంటించడంతో ఎండిపోయి ఉన్న పల్లెప్రకృతి వనంలోని మొక్కలు చాలావరకు నిప్పంటుకుని కాలిపోయాయి. ఇంత జరిగినా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని పలుగుతండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుని పల్లెప్రకృతివనాలకు పూర్వవైభవం తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పలుగుతండాలోని పల్లెప్రకృతి వనం


# హై సెక్యూరిటీ..

- నాగార్జునసాగర్ సందర్శనకు వెళ్లిన సుందరీమణులు
- హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిపై పోలీసుల భారీ బందోబస్తు
- అడుగడుగునా బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు
- అందాల తారలు తిరిగి హైదరాబాద్‌కు చేరుకునే వరకు కొనసాగిన గస్తీ


అందాల భామలు బస్సులో నాగార్జునసాగర్‌కు వెళ్తున్న సందర్భంగా సాగర్ రహదారిపై పోలీసుల బందోబస్తు



రంగారెడ్డి, మే 12 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిలో పోలీసులు సోమవారం హై సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. అడుగడుగునా బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న అందాల పోటీలకు వివిధ దేశాల నుంచి వచ్చిన సుందరీమణులు సోమవారం నాగార్జునసాగర్ సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు హైదరాబాద్ నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా బొంగుళూరు ఎగ్జిట్ నంబర్ 12 వద్ద దిగారు. అక్కడి నుంచి బొంగుళూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, మాల్, చింతపల్లి, మల్లేపల్లి, అంగడిపేట, పెద్దవురం మీదుగా నాగార్జునసాగర్‌కు వెళ్లారు. సుమారు వంద కిలోమీటర్ల దూరం వరకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి నేతృత్వంలో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యమంత్రి, గవర్నర్‌లకు కల్పించే సెక్యూరిటీ ఇచ్చారు. సుమారు పది ఎస్కార్ట్ వాహనాల మధ్య మూడు ప్రత్యేక బస్సుల్లో వారిని నాగార్జునసాగర్‌కు తరలించారు. రోడ్డుపై వాహనాలను ఎక్కడికక్కడ నిలిపేశారు. అదేవిధంగా తిరిగి వారు సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చేవరకు ఈ బందోబస్తు కొనసాగింది. సుందరీమణుల రాకపోకల సందర్భంగా రోడ్లపై ఎక్కడికక్కడే వాహనాలను నిలిపేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## ఈ వైరు..ఎక్కడిది?

హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిలోని యాచారం ఠాణా సమీపంలో ఓ కల్వర్టు కింద ఓ సంచిలో పేలుడు పదార్థాలకు ఉపయోగించే వైరు సోమవారం బాంబుస్క్వాడ్ తనిఖీల్లో లభ్యమైంది. కాగా, పోలీసులు అందాల తారలు నాగార్జునసాగర్ సందర్శనకు వెళ్తున్న నేపథ్యంలో బొంగుళూరు గేటు ఓఆర్‌ఆర్ నుంచి నాగార్జునసాగర్ వరకు సాగర్ రహదారిలోని ప్రతి కల్వర్టును క్షుణ్ణంగా తనిఖీ చేస్తుండగా ఈ వైరు ఓ సంచిలో బయటపడింది. దీంతో పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కి పడి.. ఈ వైరు ఎక్కడిదన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో బండరాళ్లను పగులగొట్టేందుకు పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను ఉపయోగిస్తున్నారు. ఆ పేలుడు పదార్థాలకు సంబంధించిన వైరా...లేక సాగర్ రహదారిపై పలువురు ప్రముఖులు రాకపోకలు సాగిస్తుంటారు.. వారిని టార్గెట్‌గా చేసి ఈ వైరును దాచిపెట్టారా..? అన్న కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతుండగా.. ఆ పోటీలకు వచ్చిన సుందరీమణులు నాగార్జునసాగర్‌కు వెళ్తున్న క్రమంలో ఈ వైరు బయటపడడంతో పోలీస్ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఆ వైరు లభ్యమైన పత్రాన్ని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, బాంబు స్క్వాడ్ ఏసీపీలు పరిశీలించారు. ఈ కల్వర్టుతోపాటు ఈ ప్రాంతంలోని మరిన్ని కల్వర్టులు, ఇతర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.


పేలుడు పదార్థాలకు ఉపయోగించే వైరు లభ్యమైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ, బాంబుస్క్వాడ్ ఏసీపీ


రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం.. అకాల వర్షానికి పొలంలోకి కొట్టుకుపోగా..దానిని ఎత్తుతున్న రైతు శ్రీనూనాయక్

## రైతు కష్టం

# వర్షార్పణం

### ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. ఆరబెట్టిన పంట నీటిపాలు

కొడంగల్, మే 12 : ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తుండడంతో ఆరుగాలం కష్టపడి పండించిన ఓ రైతు పంట అకాల వర్షంతో నేల పాలైంది. మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామానికి చెందిన శ్రీనూనాయక్ తనకున్న మూడు ఎకరాల్లో వరిని సాగు చేశాడు. తీవ్ర ఎండలు, నీటి కొరతతో పంట సగం కూడా పండలేదని, కేవలం 10 బస్తాల ధాన్యమే చేతికొచ్చిందన్నాడు. ఆ పంటను కొనుగోలు కేంద్రంలో తూకం వేయకపోవడంతో నేరుగా రైస్‌మిల్‌కు తరలించాడు. అయితే, అక్కడ తేమ శాతం ఎక్కువగా ఉన్నదని రైస్‌మిల్ నిర్వాహకులు చెప్పడంతో ఆ వడ్లను కొడంగల్ నుంచి గౌరారం వెళ్లే రోడ్డుపై ఆరబెట్టాడు. సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షంతో నీటి ప్రవాహానికి వడ్లు మొత్తం పక్కనే ఉన్న పంట పొలాల్లోకి పారడంతో అతడు కన్నీరుమున్నీరయ్యాడు. పంటను కొనుగోలు కేంద్రంలో సేకరించి ఉంటే ఈ విధంగా నష్టం జరిగేది కాదని.. పంట మొత్తం నేల పాలైందని ఆవేదన వ్యక్తం చేశాడు. తన మాదిరిగా ఎంతోమంది రైతులు ఈ విధంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పుడు పంట పెట్టుబడి పాయె.. చేతికొచ్చిన పది బస్తాల ధాన్యమూ నేలపాలై దాదాపు రూ 20 వేలకు పైగా నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.




## స్మార్ట్ కార్డుల కొరత

సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ) : ఆర్టీఏ కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల కొరత వెంటాడుతున్నది. 20 రోజులు గడిచినా ఆర్‌సీ, లైసెన్స్ కార్డులు అందడం లేదు. దీంతో వాహనదారులు సంబంధిత రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పోస్టులో మీ ఇంటికే చేరుతుందని అధికారులు చెప్పి చేతులు దులుపుకొంటున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డులు నిర్ణీత సమయంలో అందకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వారం రోజుల వ్యవధిలో చిరునామాకు లైసెన్స్‌లు, ఆర్‌సీలు చేర్చాల్సిన అధికారులు స్మార్ట్ కార్డుల కొరతతో విమర్శలు ఎదుర్కొవాల్సి వస్తున్నది. లైసెన్స్‌లు, ఆర్‌సీ కార్డుల కోసం వాహనదారుల నుంచి ముందుగానే ఫీజు కట్టించుకుని జారీలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నారు. గ్రేటర్‌లోని అన్నీ ఆర్టీఏ కార్యాలయాల్లో ఇదే సమస్య ఉన్నట్లు వాహనదారులు పేర్కొంటున్నారు.

# గన్నీ సంచులూ ఇవ్వట్లే

- ఎండిన ధాన్యాన్ని నింపేందుకు సంచులు ఇవ్వని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు
- గత నాలుగు రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం నిల్
- ఇబ్బందుల్లో అన్నదాతలు
- వర్షమొస్తే తడుస్తుందని ఆందోళన


ఎండిన వడ్లపై కవర్లు కప్పిన రైతులు

పరిగి, మే 12 : రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యాన్ని కొంటున్నామని పాలకులు, అధికారులు పేర్కొంటుండగా వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉన్నది. ధాన్యం ఎండి నాలుగైదు రోజులవుతున్నా రైతులకు గన్నీ సంచులు ఇవ్వడం లేదు. మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వం సూచించిన విధంగానే రైతులు వడ్లు ఆరబెట్టి, నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం వచ్చేలా ఎండిన తర్వాత వాటిని బస్తాల్లో నింపుతాము గన్నీ బ్యాగులు ఇవ్వాలని అధికారులను కోరితే వారు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంచులిస్తే వడ్లను వాటిలో నింపుతామని.. అకాల వర్షాలతో ఎండిన వడ్లు తడిసిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. బస్తాల కోసం గత నాలుగైదు రోజులుగా అధికారులను అడుగుతున్నా ఇవ్వడం లేదని సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ సుభాశ్‌చందర్ రెడ్డి తెలిపారు. మాజీ సర్పంచ్‌కే ఇవ్వకుంటే.. పేదల పరిస్థితి ఏమిటని ఆయన వాపోయా రు. ఇప్పటికైనా అవసరం మేరకు రైతులకు బస్తాలు అందజేసి.. ఎండిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని ఆయన అధికారులను కోరారు.